మధ్యాహ్నానికే పుట్టపర్తి ఫలితం

- అంతటా.. ఉత్కంఠ
- 14 టేబుళ్లు, 18 రౌండ్ల లెక్కింపు
- పోలైన ఓట్లు 1,82,093

పుట్టపర్తి/పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అటు పోటీ చేసిన అభ్యర్థులు, రాజకీయ పార్టీల నేతలు, ఓటర్ల ఫోకస్ అంతా కౌంటింగ్‌పైనే నిలిచింది. పుట్టపర్తి శాసనసభ స్థానానికి 15 మంది పోటీపడ్డారు. వారంతా తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. నియోజకవర్గంలో పుట్టపర్తి రూరల్, పుట్టపర్తి అర్బన్, అమడగూరు, ఓడీ చెరువు, నల్లమాడ, బుక్కపట్నం, కొత్తచెరువు మండలాలు ఉన్నాయి. నియోజకవర్గంలోని 241 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం ఓటర్లు 2,11,062 ఉండగా.. అందులో 1,82,093 మంది ఓటు వేశారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 2,808, సర్వీస్ ఓట్లు 457 ఉన్నాయి. ఒక్కో రౌండు 20 నిమిషాలు పట్టినా మధ్యాహ్నం 2 గంటలకు ఓట్ల లెక్కింపు పూర్తయ్యే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. అయితే తుది ఫలితాన్ని ప్రకటించడానికి మరింత సమయం పడుతుందని చెబుతున్నారు. కౌంటింగ్ ప్రక్రియలో రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ) భాగ్యరేఖదే తుది నిర్ణయం. ఏ అనుమానం వచ్చినా ఆర్‌ఓకు ఫిర్యాదు చేయొచ్చు.

పుట్టపర్తి నియోజకవర్గంలో పోలైన ఓట్ల వివరాలు

మండలం	పోలైన ఓట్లు	శాతం
కొత్తచెరువు	28,519	86.36
బుక్కపట్నం	28,241	86.67
పుట్టపర్తి రూరల్	20,368	90.28
పుట్టపర్తి అర్బన్	21,340	78.84
నల్లమాడ	29,300	87.25
ఓడీచెరువు	33,786	86.29
అమడగూరు	20,539	88.96
మొత్తం	1,82,093	86.27

లెక్కింపు సాగుతుందిలా..

లేపాక్షి సమీపంలోని గురుకుల పాఠశాల కేంద్రంలో మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ సాగుతుంది. ఏర్పాటు చేశారు. పుట్టపర్తి అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుళ్లు, పార్లమెంట్ నియోజకవర్గానికి 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట్లకు 3 టేబుళ్ల ఏర్పాటు చేశారు. మొత్తం నియోజకవర్గానికి 31 టేబుళ్లు ఉంటాయి. ఒక్కో టేబుల్‌కు సూపర్‌వైజర్, అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్ అని ముగ్గురు అధికారులు, ఒక పార్టీకి ఒక కౌంటింగ్ ఏజెంట్ చొప్పున ఉంటారు. అభ్యర్థులు, పరిశీలకులు ఉంటారు. కౌంటింగ్‌లో కొత్తచెరువు మండలం తలమర్ల పంచాయతీ మీర్జాపురం పోలింగ్ బూత్‌లోని ఈవీఎంను మొదట లెక్కిస్తారు. కొత్తచెరువు మండలం పూర్తి కాగానే బుక్కపట్నం, పుట్టపర్తి నల్లమాడ, ఓడీ చెరువు, అమడగూరు మండలం ఓట్లు లెక్కిస్తారు. అమడగూరు మండలం లోకోజి పల్లి పోలింగ్ కేంద్రం పరిధిలోని ఓట్ల లెక్కింపుతో ప్రక్రియ ముగిస్తారు.



లేపాక్షి కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఆర్‌ఓ భాగ్యరేఖ

మండల వ్యాప్తంగా పటిష్ట బందోబస్తు

చెన్నేకొత్తపల్లి: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మంగళవారం వెల్లడికానున్నాయి. మండలంలో ఎలాంటి సంఘటనలు జరగకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఆయన పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే గ్రామాల్లో పర్యటించి గొడవలకు దూరంగా ఉండాలని ప్రజలు అవగాహన కల్పించామన్నారు. ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తరువాత ఎలాంటి గొడవలకు పాల్పడినా.. గొడవలు జరిగేలా ప్రవర్తిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. మండలంలో ఎక్కడా ఎలాంటి అల్లర్లకు తావులేకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో 10 చోట్ల పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశామన్నారు. గొడవలు జరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం అందిన వెంటనే గ్రామాలకు వెళ్లేలా 3 క్విక్ రెస్పాండ్ టీం (త్వరగా స్పందించే టీం)లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అలాగే ప్రత్యేక పోలీసు బలగాలతో మండలంలో పర్యటిస్తూ ఉంటామన్నారు.



చెన్నేకొత్తపల్లి కూడలిలో పోలీసుల పహారా

గ్రామాల్లో అల్లర్లు జరిగే అవకాశం ఉంటే ముందుగా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

ఇద్దరు జిల్లా బహిష్కరణ

ఎన్నికల ఫలితాలు రానుండటంతో మండలంలో ఎక్కడా ఎలాంటి గొడవలకు జరగకుండా ముందు జాగ్రత్తగా ఇద్దరిని జిల్లా బహిష్కరణ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. వీరి కదలికలపై గట్టి నిఘా ఉంటుందన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

చెన్నేకొత్తపల్లి: ఎన్నికల ఫలితాల వెల్లడి అనంతరం మండలంలో ఎక్కడైనా గొడలకు పాల్పడినా.. ప్రేరేపించినా అలాంటి వారిని గుర్తించి వారిని కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. గత మూడు రోజులుగా మండల వ్యాప్తంగా ఆటోల్లో మైకులు ఏర్పాటు చేసుకుని ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల్లో గెలిచిన వారు ఇతరులను రెచ్చగొట్టేలా ప్రవర్తిస్తే చర్యలు తప్పవన్నారు. విజయోత్సవ ర్యాలీలు, బాణాసంచా కాల్చడం నిషేధించడం జరిగిందన్నారు. మండల వ్యాప్తంగా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటాయన్నారు. ప్రజలు ఎక్కడా గుంపులుగా చేరరాదన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే ప్రయత్నం చేస్తే చర్యలు తప్పవన్నారు. మండల ప్రజలు పోలీసులకు సహకరించి శాంతియుతంగా ఉండాలని సూచించారు.



చెన్నేకొత్తపల్లిలో మైక్ ద్వారా ప్రజలను అప్రమత్తం చేస్తున్న పోలీసులు

పంట మార్పిడితో ప్రయోజనం

- ఒకే పంట సాగు చేస్తే నష్టాలు
- చీడపీడల ఉధృతి ఎక్కువే
- పంట మార్పిడితో భూమిలో సేంద్రియ పదార్థాల వృద్ధి
- తెగుళ్లు సైతం అదుపులోకి



మంచి దిగుబడులకు అవకాశం

ధర్మవరం రూరల్: పొలంలో ఒకే రకం పంటను ఏళ్ల తరబడి సాగు చేస్తే దిగుబడులు తగ్గే అవకాశం ఉంది. పంటల్లో ఎదుగుదల ఉండదు. చీడపీడల ఉధృతి కూడా అధికంగా ఉంటుంది. అందుకే పంట మార్పిడి చేయాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. పొలంలో ఒకే రకం కాకుండా ఇతర పంటలు ఒక క్రమంలో సాగు చేస్తే అధిక ప్రయోజనాలు ఉంటాయని చెబుతున్నారు. పంట మార్పిడి ద్వారా ప్రకృతి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవచ్చు. తక్కువ పెట్టుబడితో భూసారానికి ఇబ్బందులు లేకుండా అధిక లాభం పొందవచ్చు. ఖరీఫ్ సీజన్‌కు సిద్ధం అవుతున్న నేపథ్యంలో పంట మార్పిడి ఆవశ్యకతపై రైతులకు ప్రయోజనకరమైన విషయాలను వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

ఒకే తరహా పంటసాగుతో నష్టాలెక్కువ

వేరు వ్యవస్థ ఒకే లోతుకు పోవడం వల్ల నేలలో ఆ లోతు వరకు ఉన్న పోషకాలను మాత్రమే మొక్కలు వినియోగించుకుంటాయి. ఏటా ఒకే రకం పంట పండించడం వల్ల చీడపీడలు, కలుపు బెడద ఎక్కువగా ఉంటుంది. పైరు కూడా అభివృద్ధి చెందదు. దిగుబడులు తగ్గుతాయి. రైతులకు పెట్టుబడి భారం పెరుగుతుంది. నేల కోతకు గురవుతుంది. పండిన పంట నాణ్యతగా ఉండదు. ఫలితంగా గిట్టుబాటు ధర లభించదు. దీంతో రైతులకు నష్టం వచ్చే అవకాశం ఉంది. మార్కెట్ సమస్యలు కూడా ఎదురవుతాయి. అందుకే వేర్వేరు పంటలు సాగు చేసుకోవాలి.

పంట మార్పిడితో భూసారం వృద్ధి

వరి సాగు చేసే ముందు పచ్చరొట్ట పైర్లు సాగు చేయడం వల్ల భూసారం పెరిగి సేంద్రియ పదార్థం భూమిలో ఎక్కువగా ఉండడం వల్ల పైరు ఏపుగా పెరుగుతుంది. వరి తరువాత గింజ జాతికి చెందిన శనగ, పెసర, వేరుశనగ వంటి పంటలను సాగు చేయడం వల్ల వాటి వేర్లలోని రైజోబియస్ బ్యాక్టీరియా గాలిలోని నత్రజనిని తీసుకుంటుంది. వేర్లలో బుడిపెల మాదిరిగా ఏర్పడి తర్వాత సాగు చేసే పంటలకు మంచి సారాన్ని అందిస్తాయి.

మంచి దిగుబడులకు అవకాశం

చాలామంది రైతులు పొలంలో ఏటా ఒకే రకం పంట సాగు చేస్తున్నారు. నీటి పారుదల కింద వరి తప్ప ఇతర పంటలు సాగు చేయడం లేదు. దీంతో వరిలో చీడపీడల బెడద ఎక్కువై సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. దీనిని నివారించేందుకు పంట మార్పిడి విధానం ఉన్నతమైనది. పంట మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలు రైతులకు ఒకసారి అనుభవంలోకి వస్తే ఆ విధానమే కొనసాగిస్తారు. వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది ఇప్పటికే గ్రామాల్లో పంట మార్పిడి విధానంపై రైతులకు విస్తృతమైన అవగాహన కల్పిస్తున్నారు.

= నియోజకవర్గంలో ప్రధాన పంటగా వేరుశనగ సాగవుతోంది. దాని తర్వాత వరి తదితర పంటలు వేస్తున్నారు. ఖరీఫ్‌లో వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 62,500 హెక్టార్లుగా అధికారులు అంచనా వేశారు. మండలాల వారీగా చూస్తే ధర్మవరంలో 17వేల హెక్టార్లు, బత్తలపల్లిలో 12,500, తాడిమర్రిలో 14వేలు, ముదిగుబ్బలో 19వేల హెక్టార్లలో వేరుశనగ సాగవుతోంది. ఇక వరి పంట అయితే నియోజకవర్గ వ్యాప్తంగా 1,198 హెక్టార్లలో వేస్తున్నారు. ఇందులో ధర్మవరం మండలంలో 700, బత్తలపల్లిలో 178, తాడిమర్రిలో 200, ముదిగుబ్బలో 120 హెక్టార్ల చొప్పున వరి సాగవుతోంది. తరచూ ఒకే పంటకు బదులు ఇతర పంటలు సాగు చేస్తే నాణ్యమైన దిగుబడులను సాధించేందుకు వీలవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు వివరిస్తున్నారు.

రైతు ముంగిటకే వ్యవసాయ సేవలు

రైతులు శ్రేయస్సు కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామస్థాయిలోనే రైతు భరోసా కేంద్రా(ఆర్‌బీకే)లు ఏర్పాటు చేసింది. వీటి ద్వారా గ్రామాలలోనే రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు తదితర వాటిని అందించడంతో పాటు గ్రామాలలోనే వుండే వ్యవసాయశాఖ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి పంటల సాగులో రైతులకు కావాల్సిన సలహాలు, సూచనలు ఇస్తు అధిక దిగుబడులను సాధించేందుకు కృషి చేస్తున్నారు.

నిబంధనలు అతిక్రమించరాదు

- డీఎస్పీ శ్రీనివాసులు

ధర్మవరం అర్బన్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని, ఎవ్వరూ నిబంధనలు అతిక్రమించరాదని ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. డీఎస్పీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యంతో కలిసి డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడారు. కౌంటింగ్ సందర్భంగా మంగళవారం రోడ్లపై ప్రజలు గుమికూడరాదని, పార్టీ కార్యాలయాల్లో ఎక్కువ సంఖ్యలో కార్యకర్తలు ఉండరాదని పేర్కొన్నారు. ఆయా పార్టీ కార్యాలయాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. హింసాత్మక ఘటనలకు పాల్పడినా, విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వ్యవహరించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతులు లేకుండా సభలు, ప్రచారాలు నిర్వహించరాదన్నారు. కౌంటింగ్ అనంతరం విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు, టపాసులు కాల్చడం చేయరాదన్నారు. ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

సోషల్ మీడియాపై నిరంతర నిఘా

సోషల్ మీడియా పోస్టులపై పోలీసు శాఖ నిరంతర నిఘా ఉంటుందని డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. రెచ్చగొట్టే పోస్టులు, ఫొటోలు, వీడియోలను వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకోవడం, షేర్ చేయడం నిషిద్ధమన్నారు. సోషల్ మీడియా వేదికగా బెదిరింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఐటీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని, రౌడీషీట్లు ఓపెన్ చేస్తామని, పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని హెచ్చరించారు. ధర్మవరం సబ్ డివిజన్ పరిధిలో అశాంతికి కారణమైన వారిని గుర్తించి 14 మందిపై జిల్లా బహిష్కరణకు అనుమతి పొందామన్నారు. ఈ నెల ఐదో తేదీ వరకు మద్యం అమ్మకాలు నిషేధించినట్లు వెల్లడించారు. కౌంటింగ్ వేళ అపరిచితులు, అనుమానితులు లాడ్జీల్లో బస చేయకుండా పందేలు కాయకుండా తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. అల్లర్లు, ఘర్షణలు జరగకుండా ఉండేందుకు క్యూఆర్‌టీలు, మొబైల్ పార్టీలు, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌లు, పికెట్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు.



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

ఓట్ల లెక్కింపునకు సహకరించండి

- అభ్యర్థులు, ఏజెంట్లతో సమావేశం

పుట్టపర్తి అర్బన్: ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించడానికి అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు సహకరించాలని పుట్టపర్తి ఆర్‌ఓ భాగ్యరేఖ కోరారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియపై ఆర్డీఓ కార్యాలయంలో అభ్యర్థులు, ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆర్‌ఓ భాగ్యరేఖ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఓట్ల లెక్కింపు నిర్వహిస్తామన్నారు. మంగళవారం ఉదయం 6 గంటలకే అందరూ కౌంటింగ్ హాల్‌లోకి చేరుకోవాలన్నారు. 7 గంటలకు స్ట్రాంగ్ రూం తెరుస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్‌లు 8 గంటలకు, ఈవీఎంలు 8.30 గంటలకు లెక్కింపు ప్రారంభిస్తామన్నారు. ఒక్కో ఏజెంటుకు ఒక్కో టేబుల్ కేటాయిస్తామన్నారు. టేబుల్ వదిలి ఎక్కడా తిరగడానికి వీలులేదన్నారు. మద్యం తాగిన వారిని లోనికి అనుమతించరన్నారు. ఏజెంట్లు ఏదైనా వాగ్వాదానికి దిగినా, సంఘటనలు చోటు చేసుకున్నా బయటకు పంపేస్తామని హెచ్చరించారు. అభ్యర్థులు, ఏజెంట్లు పూర్తిగా సహకరిస్తే త్వరితగతిన కచ్చితమైన ఫలితాలను వెల్లడించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఏదైనా అనుమానం వస్తే తనను సంప్రదించాలన్నారు. ప్రజాప్రతినిధులకు ఎలాంటి అనుమతి లేదన్నారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల మేరకు అనుమతులు ఉంటాయన్నారు. ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. లెక్కింపు పూర్తయిన తరువాత డిక్లరేషన్ ఫారం అందజేయనున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ ఐడీ కార్డు ధరించాలన్నారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థుల తరఫున ప్రతినిధులు, డీఎస్పీ వాసుదేవన్, సీఐలు కొండారెడ్డి, రాగిరి రామయ్య, తహసీల్దార్లు వేణుగోపాల్, భారతి, కళావతి, నాగభూషణ, వెంకటస్వామి, ఏఓ శేఖర్, డీటీ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌ఓ భాగ్యరేఖ, డీఎస్పీ వాసుదేవన్

పరామర్శ



నాగేంద్ర మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని పల్లెన్నగారిపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి ఇద్దరు అనారోగ్యంతో మృతి చెందారు. నాగేంద్రరెడ్డి కిడ్నీ సంబంధిత వ్యాధితో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఓబిరెడ్డి క్యాన్సర్‌తో బాధపడుతూ మృతి చెందాడు. స్థానిక నాయకుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోమవారం ఉదయం గ్రామానికి చేరుకున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాగేంద్రరెడ్డి, ఓబిరెడ్డి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని సంతాపం తెలిపారు.

జెడ్పీటీసీకి పరామర్శ..

కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న చెన్నేకొత్తపల్లి జెడ్పీటీసీ గోవిందరెడ్డిని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పరామర్శించారు. సోమవారం ఉదయం ప్రసన్నాయపేటలోని జెడ్పీటీసీ స్వగృహానికి చేరుకుని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నర్సిరెడ్డి, ఎస్టీడీ శ్రీనివాసరెడ్డి, పవన్‌కుమార్ రెడ్డి, మాడెం ప్రకాష్‌రెడ్డి, మనేరు నరసింహులు, ఓబుళేసు, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల నుంచి అనవసరంగా బయటకు రావొద్దు

రాప్తాడురూరల్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా ఏదైనా అత్యవసరం ఉంటే తప్ప మంగళవారం ఇళ్ల నుంచి ఎవరూ బయటకు రావొద్దని అనంతపురం రూరల్, ఇటుకలపల్లి పోలీసులు సూచించారు. ఈ మేరకు రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి, ఇటుకలపల్లి పీఎస్ ఎస్‌ఐ రాఘవేంద్రరెడ్డి వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. రూరల్ మండల పరిధిలోని గ్రామాల ప్రజలు ఏదైనా ముఖ్యమైన పని ఉంటేనే నగరానికి వెళ్లాలని సూచించారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎవరైనా కనిపిస్తే సీసీ కెమరాల ద్వారా గుర్తించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గ్రామాల్లో టపాసులు కాల్చరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఎక్కడా కూడా నలుగురు కంటే ఎక్కువగా జనాలు కనిపించకూడదన్నారు. ఫేస్‌బుక్, వాట్సాఫ్, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు, కించపరిచే పోస్టులు చేసినా, స్టేటస్‌గా పెట్టుకున్నా, అడ్మిన్‌పై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. క్రిమినల్ కేసులు నమోదు చేసి రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు.

క్లుప్తంగా

కౌంటింగ్ సజావుగా సాగేలా సహకరించాలి



పోలీసులతో కలిసి బత్తలపల్లిలో కవాతు నిర్వహిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

బత్తలపల్లి: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని గ్రామాల్లోనూ దుకాణాలు మూసేసి పోలీసు శాఖకు సహకరించాలని ఎస్‌ఐ శ్రీనివాసులు కోరారు. సోమవారం మండల కేంద్రం బత్తలపల్లిలోని నాలుగురోడ్ల కూడలిలో ఆయన తమ సిబ్బందితో కలిసి వ్యాపారులు, ప్రజలతో మాట్లాడారు. మండలంలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందన్నారు. అల్లర్లకు పాల్పడినా, ప్రోత్సహించినా ఉపేక్షించేది లేదన్నారు. ఫలితాల తదుపరి బాణసంచా కాల్చడం, ర్యాలీలు నిర్వహించడం, రంగులు చల్లుకోవడం, కవ్వింపు చర్యలకు పాల్పడితే సదరు వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణానికి రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని కోరారు.

వర్షంతో ఉపశమనం

గాండ్లపెంట: మండల కేంద్రం గాండ్లపెంటలో ఆదివారం రాత్రి 10 మి.మీ వర్షపాతం నమోదైంది. ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షం ఎంతో ఉపశమనం కలిగించింది. ఖరీఫ్‌లో దుక్కులు దున్నుకునేందుకు ఉపయోగకరమైందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. జీవాలకు తాగునీటితో పాటు గ్రాసానికి కూడా కొరత ఉండదని జీవాల యజమానులు తెలిపారు.

కూలీల హాజరు పెరగాలి



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామానాయక్

గాండ్లపెంట: సోమయాజులపల్లి పంచాయతీ పెద్దకొండ వద్ద ఉపాధి హామీ కింద చేపట్టిన ఖండిత కందకాల పనులను ఎంపీడీఓ రామానాయక్ సోమవారం పరిశీలించారు. మస్టర్లను పరిశీలించిన అనంతరం కూలీలతో కూలి గిట్టుబాటు గురించి ఆరా తీశారు. కొలతల మేరకు కూలి పడుతోందని కూలీలు తెలిపారు. 200 మందికి గాను 80 మంది కూలీలు పనులకు హాజరయ్యారని క్షేత్ర సహాయకుడు చంద్ర పేర్కొన్నారు. పనులపై అవగాహన కల్పించి కూలీల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సూచించారు.

విత్తనశుద్ధితోనే అధిక దిగుబడులు



వేరుశనగ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త జాన్‌సుధీర్

గాండ్లపెంట: వేరుశనగ సాగులో విత్తనశుద్ధితో అధిక దిగుబడులు పొందవచ్చని డాట్ సెంటర్ ప్రధాన శాస్త్రవేత్త జాన్‌సుధీర్ అన్నారు. కటారుపల్లిలో సోమవారం కదిరి ఏడీఏ సత్యనారాయణ, ఏఓ లక్ష్మీప్రియ ఆధ్వర్యంలో రైతులకు 'ఖరీఫ్–2024' సమాయత్తంపై కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ జాన్‌సుధీర్, డాక్టర్ రామసుబ్బయ్య, డీడీఏ –డీఆర్‌సీ విద్యావతి పాల్గొని రైతులకు వేరుశనగ సాగుపై అవగాహన కల్పించారు. విత్తన శుద్ధి చేయడం వల్ల భూమి ద్వారా సంక్రమించే తెగులు, పురుగుల నుంచి పంటను కాపాడుకోవచ్చన్నారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు, జిప్సం తప్పనిసరిగా వాడాలన్నారు. కార్యక్రమంలో గ్రామ రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోండి



కరపత్రాలు విడుదల చేస్తున్న యువర్స్ ఫౌండేషన్ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలలో ఈ నెల ఎనిమిదో తేదీన పుష్పగిరి కంటి ఆస్పత్రి–కడప వైద్యులచే నిర్వహించే కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం కోరారు. ఉచిత కంటి వైద్య శిబిరం కరపత్రాలను సోమవారం వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంటిచూపు తగ్గిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు సుకుమార్, కోశాధికారి బండి నాగేంద్ర, దాత చింతా శ్రీనివాసులు, సభ్యులు చాంద్‌బాషా, ఖలీల్, మోహన్, రమేష్‌బాబు, డాక్టర్ బీవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చల్లబడిన వాతావరణం

బత్తలపల్లి: రుతుపవనాల ప్రవేశంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. రెండు నెలలుగా ఎండలు, వడగాల్పుల ఉధృతితో విలవిల్లాడిన ప్రజలకు నైరుతి రుతుపవనాలు కేరళను తాకాయన్న శుభవార్తతో ఊపిరి పీల్చుకున్నారు. బత్తలపల్లి మండలంలో సోమవారం తెల్లవారుజామున గంటన్నర పాటు ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. 29.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌ఓ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ తెలిపారు. ఈ వర్షంతో మెట్ట, మాగాణి భూములు దుక్కులు దున్ని వ్యవసాయ పనులు చేపట్టేందుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. ప్రభుత్వం 40 శాతం సబ్సిడీపై రైతు భరోసా కేంద్రాల ద్వారా వేరుశనగ విత్తన కాయలను అందిస్తోందని వ్యవసాయాధికారి ఓబిరెడ్డి తెలిపారు. వేసవి దుక్కులు చేపట్టడం వల్ల అధిక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. రైతులు సలహాలు, సూచనలు పాటించి ఖరీఫ్‌లో సరైన దిగుబడులు సాధించాలని ఆయన కోరారు.

ధర్మవరం డివిజన్‌లో 117 మి.మీ వర్షం



వర్షానికి పారుతున్న వంక

ధర్మవరం రూరల్: ధర్మవరం రెవిన్యూ డివిజన్‌లో సోమవారం తెల్లవారుజామున 117.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి తెలిపారు. ధర్మవరంలో 12.4 మి.మీ, బత్తలపల్లిలో 29.2, తాడిమర్రిలో 28.4, ముదిగుబ్బలో 3.2, కనగానపల్లిలో 43.2, రామగిరిలో 1.4 మి.మీ వర్షం కురిసిందన్నారు.

సోషల్‌మీడియా పోస్టులపై ప్రత్యేక నిఘా

ఎన్పీకుంట: ఎస్పీ ఆదేశాల మేరకు సోషల్ మీడియా పోస్టులపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎస్‌ఐ శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు దృష్ట్యా పలువురు సోషల్ మీడియా వేదికగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, బెదిరింపులకు పాల్పడటం వంటివి జరుగుతున్నాయని పేర్కొన్నారు. వాట్సాప్ ద్వారా వివిధ గ్రూపులను నిర్వహించే అడ్మిన్‌లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తప్పుడు సమాచారాన్ని నియంత్రించాలని, లేకుంటే ఐటీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎన్నికలలో విజయం సాధించిన వారు సంయమనం పాటించాలని, అలాకాకుండా రెచ్చగొట్టే పోస్టులు పెట్టి కష్టాలను కొనితెచ్చుకోవద్దని సూచించారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా గణితం బోధించేందుకు అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రశాంతి కోరారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎమ్మెస్సీ (మ్యాథ్స్) పూర్తి చేసిన వారు ఈ పోస్టుకు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల పదో తేదీ ఉదయం 11 గంటలకు కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూలో పాల్గొనాలని సూచించారు. మరిన్ని వివరాలకు 97031 51381 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ప్రశాంతతకు భంగం వాటిల్లరాదు

గాండ్లపెంట: కౌంటింగ్ నేపథ్యంలో ఎక్కడా గొడవలకు పాల్పడకుండా.. ప్రశాంతంగా జీవించాలని ఎంపీడీఓ రామానాయక్ సూచించారు. మండలంలోని 14 గ్రామపంచాయతీల్లో కార్యదర్శులు, వీఆర్వోలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలన్నారు. ఈ నెల ఆరో తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. గ్రామాల్లో టాంటాం వేయించి.. ఏ చిన్న సమస్య తలెత్తినా వెంటనే ఎంసీసీ లేదా స్టేషన్ హౌస్ ఆఫీసర్, తహసీల్దార్‌కు సమాచారం అందజేయాలని సూచించారు. సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

126 పోస్టల్ బ్యాలెట్లు



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి వెంకట శివరామిరెడ్డి

ధర్మవరం అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో మొత్తం 126 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నమోదయ్యాయని రిటర్నింగ్ అధికారి వెంకట శివరామిరెడ్డి తెలిపారు. ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఆర్మీ ఉద్యోగస్తుల నుంచి వచ్చిన 126 పోస్టల్ బ్యాలెట్ పత్రాలను ప్రత్యేక బాక్సులో వేసి సీల్ వేశామన్నారు. అనంతపురం హెడ్ పోస్టాఫీసు నుంచి పోస్టల్ బ్యాలెట్ పత్రాలు మంగళవారం నేరుగా కౌంటింగ్ కేంద్రానికి చేరుస్తామని తెలిపారు.